

విద్యార్థులకు హెల్మెట్‌లు పంపిణీ చేస్తున్న డాక్టర్ గౌతమ్‌రావు, కార్పొరేటర్ అమృత, ట్రాఫిక్ ఎస్ఐ దేవదాసు, మధుసూదన్‌యాదవ్

రోడ్డు భద్రతపై విద్యార్థులకు అవగాహన

నల్లకుంట, ఫిబ్రవరి 23 (ఆంధ్రజ్యోతి): రోడ్డు భద్రత అవగాహన కార్యక్రమంలో భాగంగా శుక్రవారం నల్లకుంట డివిజన్‌లోని స్ఫూర్తి భవన్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో హిప్ హీరో కార్పొరేషన్ - ఇండియన్ హెచ్ ఇంజూరీ ఫౌండేషన్ సౌజన్యంతో 1 నుంచి 6వ తరగతి విద్యార్థులకు వారి తల్లిదండ్రులకు అవగాహన కల్పించడానికి హెల్మెట్లు పంపిణీ చేశారు. బీజేపీ సెంట్రల్ జిల్లా అధ్యక్షుడు డాక్టర్ ఎన్.గౌతమ్‌రావు ముఖ్యఅతిథిగా హాజరైన హిప్ హీరో కార్పొరేషన్ ఇన్‌చార్జి అనూరాధ ప్రసాద్, నల్లకుంట కార్పొరేటర్ యాకర అమృత, ట్రాఫిక్ ఎస్ఐ దేవదాసు, స్ఫూర్తి భవన్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షుడు ఎం.మధుసూదన్‌యాదవ్, కో-ఆర్డినేటర్ శిరీష, కృష్ణ, శ్రీనివాస్, సునీల్, స్వప్న, ప్రశాంతి, శ్రీవిద్య పాల్గొన్నారు.

సైబర్ సెక్యూరిటీ కోర్సుల శిక్షణకు దరఖాస్తుల ఆహ్వానం

బర్కత్‌పుర, ఫిబ్రవరి 23 (ఆంధ్రజ్యోతి): సైబర్ సెక్యూరిటీ కోర్సుల్లో శిక్షణ కోసం ఆన్‌లైన్‌లో దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు నేషనల్ అకాడమీ ఆఫ్ సైబర్ సెక్యూరిటీ సంస్థ డైరెక్టర్ విమలారెడ్డి తెలిపారు. ఇంటర్, డిగ్రీ, పీజీ, ఇంజనీరింగ్, పాలిటెక్నిక్ డిప్లొమా అభ్యర్థులు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవచ్చని ఆమె తెలిపారు. ఈనెల 29వ తేదీలోపు ఆసక్తి గల అభ్యర్థులు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని తెలిపింది. వివరాలకు 7893141797లో సంప్రదించాలని ఆమె కోరారు.

ఉత్తమ సమాజ నిర్మాణంలో పోలీసులది కీలకపాత్ర



మాట్లాడుతున్న శివధర్‌రెడ్డి

అంబర్‌పేట, ఫిబ్రవరి 23 (ఆంధ్రజ్యోతి): ఉత్తమ సమాజ నిర్మాణంలో పోలీసులది కీలకపాత్ర అని, శాంతిభద్రతల పర్యవేక్షణ చేస్తూ వారు సమాజంలో బాధ్యతాయుతంగా విధులు నిర్వహిస్తున్నారని అడిషనల్ డైరెక్టర్ జనరల్ ఆఫ్ పోలీస్ రాష్ట్ర ఇంటలిజెన్స్ శివధర్‌రెడ్డి అన్నారు. శుక్రవారం అంబర్‌పేట పోలీస్ ట్రైనింగ్ కాలేజీలో కానిస్టేబుల్స్ అభ్యర్థుల శిక్షణ శిబిరాన్ని ఆయన ప్రారంభించి మాట్లాడారు. పోలీసు స్టేషన్లకు వచ్చే బాధితులకు నమ్మకం కలిగించేలా పోలీసుల ప్రవర్తన ఉండాలన్నారు. శిక్షణ పొంది ఉత్తమ పోలీసులుగా పేరు తెచ్చుకోవాలని ఆయన సూచించారు. పీటీసీ ప్రిన్సిపాల్ మధుకర్ మాట్లాడుతూ.. 9 నెలల పాటు నిర్వహించే శిక్షణా శిబిరంలో పోలీసులు అన్ని విధాలుగా రాణించేలా శిక్షణ అందిస్తామన్నారు. డీఎస్పీలు పిచ్చయ్య, లక్ష్మీకాంత్‌రెడ్డి, మధుమోహన్, ఇన్‌స్పెక్టర్లు వెంకట్‌రెడ్డి, శ్రీనివాస్, శ్రీశైలం సిబ్బంది పాల్గొన్నారు.

త్వరలో కాచిగూడ, నల్లకుంట ట్రాఫిక్ పీఎస్‌లకు కొత్త భవనాలు

బర్కత్‌పుర, ఫిబ్రవరి 23 (ఆంధ్రజ్యోతి): తూర్పు మండలం ట్రాఫిక్ పరిధిలో కాచిగూడ, నల్లకుంట ట్రాఫిక్ పోలీస్‌స్టేషన్లకు నూతన భవనాలు నిర్మిస్తున్నట్లు ట్రాఫిక్ ఏసీపీ ఎస్.సంపత్‌కుమార్ తెలిపారు. ఈ రెండు ట్రాఫిక్ పీఎస్‌ల భవన నిర్మాణానికి గతంలో ప్రతిపాదనలు రూపొందించామన్నారు. కాచిగూడ ట్రాఫిక్ పీఎస్‌ను సందర్శించిన సందర్భంగా ట్రాఫిక్ సీఐ ఏ.శ్రీనివాస్‌తో కలిసి మాట్లాడారు. కొత్త ట్రాఫిక్ పీఎస్‌ల ఏర్పాటు తర్వాత అంబర్‌పేట సీపీఎల్‌లోని కాచిగూడ ట్రాఫిక్ పీఎస్‌ను అంబర్‌పేట ట్రాఫిక్ పీఎస్‌కు కేటాయించామన్నారు. ప్రస్తుతం కాచిగూడ ట్రాఫిక్ పీఎస్‌ను నారాయణగూడ బ్లడ్‌బంక్ పక్కన ఉన్న క్వార్టర్స్‌లో కొనసాగుతుందన్నారు. అదే క్వార్టర్స్‌లోని స్థలంలో కాచిగూడ ట్రాఫిక్ పీఎస్ భవనాన్ని నిర్మిస్తున్నట్లు తెలిపారు. నల్లకుంట ట్రాఫిక్ పీఎస్‌కు నల్లకుంట పీఎస్ పక్కన గల ఖాళీ స్థలంలో కొత్త భవనాన్ని నిర్మించనున్నట్లు తెలిపారు.

గ్రంథాలయాల్లో ఖాళీలను భర్తీ చేయాలి



మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డికి వినతిపత్రం ఇస్తున్న సంఘం నేతలు

అంబర్‌పేట, ఫిబ్రవరి 23 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోని గ్రంథాలయాల్లో ఖాళీగా ఉన్న గ్రంథపాలకుల ఉద్యోగాలను భర్తీ చేయాలని కోరుతూ తెలంగాణ గ్రంథాలయ సంఘం నేతలు మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డికి వినతిపత్రం సమర్పించారు. తెలంగాణ గ్రంథాలయ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ప్రొఫెసర్ ఎస్.లక్ష్మణరావు, ప్రధాన కార్యదర్శి చేగోని రవికుమార్‌ల ఆధ్వర్యంలో గ్రంథాలయ సంఘం సభ్యులు మంత్రిని శుక్రవారం ఆయన నివాసంలో కలిసి వినతిపత్రం సమర్పించారు. నూతన గ్రంథాలయాలను ఏర్పాటు చేయాలని కోరారు. మంత్రిని కలిసిన వారిలో లక్‌పతినాయక్, మల్లికార్జున్, భార్గవ్ తదితరులు ఉన్నారు.



పవర్‌బోర్ పనులు ప్రారంభిస్తున్న కార్పొరేటర్ పావనివినయ్‌కుమార్

అశోక్‌నగర్ అభివృద్ధికి ప్రత్యేక చర్యలు

చిక్కడపల్లి, ఫిబ్రవరి 23(ఆంధ్రజ్యోతి): డివిజన్ అభివృద్ధికి ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నట్లు గాంధీనగర్ కార్పొరేటర్ ఎ.పావనివినయ్‌కుమార్ వివరించారు. డివిజన్‌లోని అశోక్‌నగర్‌లో ఎంపీ లాడ్స్ నిధులు 6.50 లక్షల రూపాయలతో శుక్రవారం పవర్ బోర్ నిర్మాణ పనులను కార్పొరేటర్ పావనివినయ్‌కుమార్ ప్రారంభించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ.. రెండు అంతస్తుల ఈ భవనంలో స్కిల్డ్ కార్యక్రమాలు నిర్వహిస్తున్న క్రమంలో పవర్‌బోర్ ఏర్పాటు కోసం విజ్ఞప్తి చేయగా కిషన్‌రెడ్డి నిధులు మంజూరు చేశారన్నారు. బీజేవైఎం నగర మాజీ అధ్యక్షుడు వినయ్‌కుమార్, డివిజన్ బీజేపీ అధ్యక్షుడు రత్నసాయిచంద్, నర్సింగ్‌రావు, ప్రకాష్‌యాదవ్, ఆకుల సురేందర్, నవీన్‌కుమార్, అరుణ్‌కుమార్, గోపి, సత్యేందర్, వెల్ఫేర్‌సెంటర్ అధ్యక్ష, కార్యదర్శులు రామ్మూర్తి, సూర్యప్రకాష్ పాల్గొన్నారు.

బాధ్యతలు స్వీకరించిన డీసీఎల్



రాజేంద్రప్రసాద్

చిక్కడపల్లి, ఫిబ్రవరి 23(ఆంధ్రజ్యోతి): ఆర్టీసీ క్రాస్ రోడ్‌లోని తెలంగాణ కార్మిక కమిషనరేట్ కార్యాలయంలో కార్మికశాఖ డిప్యూటీ లేబర్ కమిషనర్ (డీసీఎల్)గా రాజేంద్రప్రసాద్ బాధ్యతలు చేపట్టారు. నల్గొండ నుంచి రాజేంద్రప్రసాద్ బదిలీపై ఇక్కడకు రాగా ఇప్పటి వరకు విధులు నిర్వహించిన శ్యామ్‌సుందర్‌రాజు బదిలీపై నల్గొండకు వెళ్లారు. రాజేంద్రప్రసాద్ మాట్లాడుతూ.. కార్మికుల సంక్షేమమే ధ్యేయంగా పని చేస్తానని వివరించారు.



సమావేశంలో మాట్లాడుతున్న డీఎంసీ, కార్పొరేటర్లు, అధికారులు

పరిసరాల పరిశుభ్రతతో ఆరోగ్యం

చిక్కడపల్లి, ఫిబ్రవరి 23(ఆంధ్రజ్యోతి): పరిసరాల పరిశుభ్రతతో ఆరోగ్యవంతమైన జీవితాన్ని గడపొచ్చని జీహెచ్‌ఎంసీ సర్కిల్-15 డీఎంసీ ఖాదర్ మొయినుద్దీన్ అన్నారు. శుక్రవారం గాంధీనగర్ డివిజన్‌లోని జవహర్‌నగర్ కమ్యూనిటీహాల్‌లో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. రోడ్లపై చెత్త వేయకూడదన్నారు. చెత్తను రోడ్లపై వేయడంతో బస్తీల్లో, కాలనీల్లో అపరిశుభ్రత నెలకొనడంతో పాటు దోమలు, ఈగలు అధికమై రోగాలు వ్యాప్తి చెందే ప్రమాదముందన్నారు. మహిళా గ్రూప్ సభ్యులు, ఆయా కాలనీల్లో రోడ్లపై చెత్త వేయకుండా ప్రజలకు అవగాహన కల్పించాలని సూచించారు. కార్యక్రమంలో కార్పొరేటర్లు ఎ.పావనివినయ్‌కుమార్, రవిచారి, సుప్రియనవీన్‌గౌడ్, రచనశ్రీ, ఏఎంవోహెచ్ మైత్రేయి, అధికారులు సుధాకర్, శంకర్ తదితరులు పాల్గొన్నారు.

రైతు పోరాటాన్ని తీవ్రం చేస్తాం

● 26న జాతీయ రహదారులపై ట్రాక్టర్లు, వాహనాలతో ర్యాలీ ● రైతు, ప్రజా సంఘాల నేతల వెల్లడి



కేంద్రం, హరియాణా ప్రభుత్వాల దిష్టిబొమ్మను దహనం చేస్తున్న ప్రజా సంఘాల నేతలు

రాంనగర్, ఫిబ్రవరి 23 (ఆంధ్రజ్యోతి): రైతుపోరాటాన్ని తీవ్రం చేయనున్నట్లు పలు రైతు, ప్రజాసంఘాల నేతలు వెల్లడించారు. రైతుల పోరాటం అణచివేతకు వ్యతిరేకంగా దేశవ్యాప్తంగా రైతులను చైతన్యం చేయనున్నట్లు వారు తెలిపారు. రైతుల నిరసన స్థలంలో రైతు ట్రాక్టర్లను పోలీసులు ధ్వంసం చేశారని వారు ఆరోపించారు. యువరైతు శుభకరన్‌సింగ్‌ను కేంద్ర, హరియాణా రాష్ట్ర ప్రభుత్వాలు హత్య చేయడాన్ని నిరసిస్తూ సంయుక్త కిసాన్‌మోర్చా (ఎస్‌కెఎం), కార్మిక సంఘాల ఆధ్వర్యంలో శుక్రవారం సుందరయ్య పార్కు వద్ద ఆ ప్రభుత్వాల దిష్టిబొమ్మను దహనం చేశారు. ఈ సందర్భంగా కేంద్ర హోంమంత్రి, హరియాణా సీఎంలపై హత్యానేరం మోపాలని, రైతాంగ ఉద్యమంపై నిర్బంధాన్ని ఆపాలని, కనీస మద్దతు ధరల చట్టం చేయాలని నినాదాలు చేశారు. ఈ సందర్భంగా సంయుక్త కిసాన్‌మోర్చా (ఎస్‌కెఎం) రాష్ట్ర కన్వీనర్, తెలంగాణ రైతు సంఘం ప్రధాన కార్యదర్శి టి.సాగర్, కన్వీనర్లు ఉపేందర్‌రెడ్డి, మామిడాల భిక్షపతి, జక్కుల వెంకటయ్య, ఝాన్సీ, తెలంగాణ రైతు సంఘం రాష్ట్ర అధ్యక్షుడు పోతినేని సుదర్శన్‌రావు, మాజీ ఎమ్మెల్యే జూలకంటి రంగారెడ్డి, తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆర్.వెంకటరాములు, సీఐటీయూ ప్రధాన కార్యదర్శి పాలడుగు భాస్కర్ మాట్లాడారు. రైతులను చంపి, గాయపరిచినందుకు పంజాబ్, హరియాణా ప్రభుత్వానికి, పోలీసులకు వ్యతిరేకంగా సెక్షన్ 302 కింద ఎఫ్ఐఆర్ నమోదు చేయాలని డిమాండ్ చేశారు. ఈ ఘటనపై సుప్రీంకోర్టు న్యాయమూర్తిచే న్యాయ విచారణ జరిపించాలని డిమాండ్ చేశారు. అలాగే మృతుల కుటుంబానికి కోటి రూపాయల నష్ట పరిహారం ఇవ్వాలని కోరారు. పాడైన 100 ట్రాక్టర్ల మరమ్మతు ఖర్చులు చెల్లించాలన్నారు. కేంద్ర ప్రభుత్వం స్పందించకపోతే ఈనెల 26న జాతీయ రహదారులపై ట్రాక్టర్లు, వాహనాలతో ర్యాలీలు నిర్వహిస్తామని వారు హెచ్చరించారు. తెలంగాణ రాష్ట్రంలో జరిగే ఆందోళనలో పార్టీలకతీతంగా రైతులు, ప్రజలు భాగస్వాములు కావాలని కోరారు. కార్యక్రమంలో మూడ్ శోభన్, బొంతు రాంబాబు, చుక్కయ్య, బ్రహ్మం, జగన్, పద్మ, అరుణ, వెంకటేష్, మహేష్, రాహుల్ పాల్గొన్నారు.

27న గ్రేటర్ జర్నలిస్టుల హౌసింగ్ సొసైటీ సమావేశం

నల్లకుంట, ఫిబ్రవరి 23 (ఆంధ్రజ్యోతి): గ్రేటర్ హైదరాబాద్ జర్నలిస్ట్స్ మ్యూచువల్లీ ఎయిడెడ్ కో-ఆపరేటివ్ హౌసింగ్ సొసైటీ సర్వసభ్య సమావేశం ఈనెల 27న ఉదయం 10 గంటలకు చిక్కడపల్లిలోని త్యాగరాయగానసభలో నిర్వహించనున్నట్లు సొసైటీ అధ్యక్షుడు మామిడి సోమయ్య, కార్యదర్శి బొల్లం శ్రీనివాస్ శుక్రవారం తెలిపారు. ఈ సమావేశానికి రాష్ట్ర మంత్రులు పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, పొన్నం ప్రభాకర్, టీజేఎస్ అధ్యక్షుడు ప్రొఫెసర్ ఎం.కోదండరాం, రిజిస్ట్రార్ ఆఫ్ సొసైటీస్ అధికారులు హాజరవుతారని తెలిపారు. గ్రేటర్ హైదరాబాద్ పరిధిలోని ప్రింట్, ఎలక్ట్రానిక్ మీడియాలో పనిచేస్తున్న వెయ్యిమంది జర్నలిస్టులు సొసైటీలో సభ్యులుగా ఉన్నారని తెలిపారు. జర్నలిస్టులు 15 ఏళ్లుగా ఇళ్లస్థలాల కోసం ఎదురుచూస్తున్నారని పేర్కొన్నారు.

కార్పొరేషన్ ఏర్పాటు కోసం వినతి

చిక్కడపల్లి: మున్నూరుకాపు కార్పొరేషన్ ఏర్పాటు చేయాలని కోరుతూ బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్‌లను తెలంగాణ మున్నూరుకాపు యువజన సంక్షేమసంఘం, మున్నూరుకాపు సంఘం తెలంగాణ రాష్ట్ర ప్రతినిధులు గాంధీభవన్‌లో కలిసి విజ్ఞప్తి చేశారు.

రాష్ట్రవ్యాప్తంగా కులగణన నిర్వహించాలి

జాతీయ బీసీదళ్ అధ్యక్షుడు కుమారస్వామి

బర్కత్‌పుర, ఫిబ్రవరి 23 (ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ ప్రభుత్వం కులగణనపై అసెంబ్లీలో తీర్మానం చేయడం చారిత్రాత్మకమైనదని, బీసీల జీవితాలలో వెలుగులు నింపడానికి సామాజిక, ఆర్థిక సర్వే ఎంతో దోహదపడుతుందని జాతీయ బీసీదళ్ అధ్యక్షుడు దుండ్ర కుమారస్వామి అన్నారు. ప్రభుత్వం రాష్ట్రవ్యాప్తంగా సమర్థవంతంగా కులగణన నిర్వహించాలని, కులగణనకు తగిన సమయం కేటాయించి విస్తృతమైన అవగాహన, ప్రచారం నిర్వహించాలని ఆయన విజ్ఞప్తి చేశారు. శుక్రవారం కాచిగూడలో కులగణనపై మేధోమధన సదస్సు నిర్వహించారు. మేధావులు, న్యాయవాదులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. బీసీ సమగ్రాభివృద్ధి, సంక్షేమానికి కులగణన ప్రధాన భూమిక పోషిస్తుందన్నారు. న్యాయపరమైన సవాళ్లను ఎదుర్కొనే విధంగా రాష్ట్ర ప్రభుత్వం సమగ్రమైన కులగణన చేయాలని కోరారు. వ్యక్తి గోప్యత, హక్కులను కాపాడే విధంగా కులగణన ఉండాలని తెలిపారు. ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగించి డేటా సేకరణను సరళీకృతం చేయాలన్నారు. రాష్ట్రంలోని ప్రజలంతా కులగణన సర్వేకు అందుబాటులో ఉండి పూర్తి డేటాను సర్వే నిర్వాహకులకు అందజేయాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో జాతీయ బీసీదళ్ వర్కింగ్ ప్రెసిడెంట్ డాక్టర్ మహేంద్రబాబు తదితరులు పాల్గొన్నారు.



సదస్సులో ప్రసంగిస్తున్న కుమారస్వామి

వీణాగోష్ఠి గానమాధుర్యంతో గురువందనం



ఆనంద రాజ్యలక్ష్మిని సత్కరిస్తున్న శిష్యబృందం

చిక్కడపల్లి, ఫిబ్రవరి 23(ఆంధ్రజ్యోతి): ప్రముఖ వీణావాయిద్య నిపుణులు ఆనందరాజ్యలక్ష్మి చవాన్ శిష్యబృందం వీణాగోష్ఠి గానమాధుర్యంతో గురువందనం చేశారు. త్యాగరాయగానసభలో శుక్రవారం సాయంత్రం ప్రముఖ సంగీత సంస్థ ఆనంద మహతీ కల్చరల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో గురువందనం పేరిట శాస్త్రీయ సంగీత భరిత కార్యక్రమం జరిగింది. వీణావాయిద్య గోష్ఠిలో కళాకారిణులు శ్రుతిలయబద్ధంగా వాగ్గేయకారుల కీర్తనలు వీణలపై పలికించారు. అనంతరం సభలో కస్టమ్స్ మాజీ ఉన్నతాధికారి ఎం.శ్రీనివాస్ మాట్లాడారు. క్షీరసాగరం వ్యవస్థాపకులు ఆనందమోహన్, వైద్యులు సెంథిల్ రాజప్ప, గాయని బాలాత్రిపురసుందరి, న్యాయవాది విజయకుమార్ పాల్గొన్నారు. ఆనందలక్ష్మికి శిష్యులు పాదపూజ చేశారు.

డీడీఎంఎస్‌లో ఒకేషనల్ కోర్సులకు దరఖాస్తుల ఆహ్వానం

రాంనగర్, ఫిబ్రవరి 23 (ఆంధ్రజ్యోతి): దుర్గాబాయ్ దేశ్‌ముఖ్ మహిళా సభ ఒకేషనల్ కోర్సు సెంటర్‌లో పలు కోర్సులకు ఆసక్తి గల వారి నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు అధికారులు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఫార్మసీ అసిస్టెంట్, హెల్త్‌కేర్ మల్టీపర్పస్ వర్కర్ (నర్సు కోర్సు), ఆపరేషన్ థియేటర్ టెక్నీషియన్, డయాలసిస్ అసిస్టెంట్, బెడ్‌సైడ్ అసిస్టెంట్, తదితర కోర్సుల్లో సర్టిఫికెట్ కోర్సు అందించనున్నట్లు పేర్కొన్నారు. డయాలసిస్ అసిస్టెంట్ కోర్సుకు కనీస అర్హత ఇంటర్మీడియట్, బెడ్‌సైడ్ అసిస్టెంట్ కోర్సుకు 8వ తరగతి అర్హత కాగా, మిగతా కోర్సులకు పదో తరగతి పాసై ఉండాలన్నారు. అన్ని వయసుల వారు ఈ కోర్సుల్లో చేరేందుకు అర్హులన్నారు. ఆసక్తి గలవారు ఈనెల 29 వరకూ దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ఇతర వివరాలకు 83090 37134, 63058 95867లలో సంప్రదించాలని తెలిపారు.

ఎఫ్‌ఎఫ్‌సీ తనిఖీలను వాయిదా వేయండి..!



మాట్లాడుతున్న వీసీ నర్సింహారెడ్డి, వేదికపై రెక్టార్, రిజిస్ట్రార్

హైదరాబాద్ సిటీ, ఫిబ్రవరి 23 (ఆంధ్రజ్యోతి): బీ ఫార్మసీ, ఎంఫార్మసీ గ్రాడ్యుయేట్లకు ఇండస్ట్రీల్లో డిమాండ్ ఎక్కువగా ఉన్నందున, తమ కళాశాలల్లో బోధనా సిబ్బంది కొరత తీవ్రంగా ఉందని పలు ఫార్మసీ కాలేజీల యాజమాన్య ప్రతినిధులు పేర్కొన్నారు. శుక్రవారం ఫార్మసీ కళాశాలల యాజమాన్యాలతో జేఎన్‌టీయూ ఉన్నతాధికారులు సమావేశమయ్యారు. ఈ సందర్భంగా కొన్ని కళాశాలల చైర్మన్లు తమ సమస్యలను ఏకరువు పెట్టారు. నిబంధనలకు అనుగుణంగా బోధనా సిబ్బందిని నియమించుకునేందుకు మరో రెండువారాల గడువు ఇవ్వాలని, నియామకాలు పూర్తయ్యే వరకు ఫ్యాక్ట్ ఫైండింగ్ కమిటీ (ఎఫ్ఎఫ్‌సీ) తనిఖీలను వాయిదా వేయాలని వైస్‌చాన్స్‌లర్ డాక్టర్ కట్టా నర్సింహారెడ్డికి విజ్ఞప్తి చేశారు. వీసీ మాట్లాడుతూ.. యాజమాన్యాల సూచనలను, ఇబ్బందులను పరిగణనలోకి తీసుకుంటామన్నారు. ఈ సమావేశంలో యూనివర్సిటీ రెక్టార్ విజయకుమార్‌రెడ్డి, రిజిస్ట్రార్ వెంకటేశ్వరరావు, ఆడిట్ సెల్ అధికారులు తారాకళ్యాణి, రవీంద్రరెడ్డి, ప్రసన్న తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న నాగేశ్వరరావు

పార్లమెంట్ ఎన్నికల్లో ఆర్‌పీఐ పోటీ

రాంనగర్, ఫిబ్రవరి 23 (ఆంధ్రజ్యోతి): పార్లమెంట్ ఎన్నికల్లో రిపబ్లిక్ పార్టీ ఆఫ్ ఇండియా (ఆర్‌పీఐ) పోటీ చేస్తుందని ఆ పార్టీ జాతీయ ఉపాధ్యక్షుడు బైగళ్ల నాగేశ్వరరావు తెలిపారు. శుక్రవారం ఎస్‌వీకేలో ఆ పార్టీ రాష్ట్ర సమావేశానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. ఎంపీ ఎన్నికల్లో అన్ని స్థానాల్లో తమ పార్టీ పోటీ చేస్తుందన్నారు. రాష్ట్రంలోని 33 జిల్లాల్లో తమ పార్టీ పటిష్టంగా ఉందన్నారు. సందర్భంగా తెలంగాణ రాష్ట్ర ఇన్‌చార్జిగా రత్నప్రసాద్‌ను నియమించినట్లు ప్రకటించారు. ప్రభుదాసు, శివనాగేశ్వరరావు, రవికుమార్, అనిత పాల్గొన్నారు.

ఎన్టీఆర్ స్టేడియంలో శత రాజశ్యామల హోమం



హోమంలో కామాఖ్యామృత వేణు శ్యామలమాత

కవాడిగూడ, ఫిబ్రవరి 23 (ఆంధ్రజ్యోతి): కామాఖ్యామృత శోధన సంస్థ ఆధ్వర్యంలో శుక్రవారం నగరంలోని ఎన్టీఆర్ స్టేడియంలో రాజశ్యామల అమ్మవారి ద్వితీయ వార్షికోత్సవం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా శత రాజశ్యామలహోమం, శివపార్వతుల కల్యాణం, లలితాసహస్ర పారాయణం, శ్రీయంత్రసిరిజ్యోతిపూజ కార్యక్రమాలు నిర్వహించారు. కార్యక్రమాలలో వేణు శ్యామలమాత పాల్గొన్నారు. కార్యక్రమంలో బీజేపీ ముషీరాబాద్ అసెంబ్లీ కన్వీనర్ రమేష్‌రాం, కవాడిగూడ కార్పొరేటర్ జి.రచనశ్రీ, నాయకులు పాల్గొన్నారు.



సాయం అందజేస్తున్న ఫౌండేషన్ ప్రతినిధులు

విద్యార్థులకు ఆర్థిక సాయం

చిక్కడపల్లి, ఫిబ్రవరి23 (ఆంధ్రజ్యోతి): గాంధీనగర్ డివిజన్ అభ్యుదయ ఉన్నత పాఠశాలలో చదువుతున్న ఇద్దరు విద్యార్థులకు తుఫాన్ ఫౌండేషన్ సంస్థ ఆర్థిక సాయం అందించింది. శుక్రవారం పాఠశాల ఆవరణలో జరిగిన కార్యక్రమంలో బీజేపీ ఓబీసీ మోర్చా జాతీయ అధ్యక్షుడు డా. కె.లక్ష్మణ్ తనయుడు కోవ రాహుల్, సామాజికవేత్త దోనేటి సత్యం పాల్గొని ఇద్దరు విద్యార్థులకు పదివేల రూపాయల ఆర్థిక సాయం(ఫీజు) నగదు అందించారు. కార్యక్రమంలోపాల్గొన్న సాఫ్ట్‌వేర్ ఉద్యోగి తాడేపల్లి శ్రీనివాస్ మాట్లాడుతూ.. నేటితరం యువత ఉద్యోగం సంపాదనతో పాటు సామాజిక కార్యక్రమాల్లో పాల్గొనడం సంతోషంగా ఉందని పేర్కొన్నారు. తుఫాన్ ఫౌండేషన్ అధ్యక్షుడు డి.బాలకృష్ణ నేతృత్వంలో జరిగిన కార్యక్రమంలో అభ్యుదయ హైస్కూల్ ప్రిన్సిపాల్ శైలజ, చిలుకూరి లలిత, తాడేపల్లి శ్రీనివాస్, బీజేపీ నాయకులు తొలుపునూరి రమేష్‌గౌడ్, లక్ష్మీనారాయణ, రవీందర్‌గౌడ్ పాల్గొన్నారు.



● సీఎంఆర్‌ఎఫ్ సాయం

అనారోగ్యంతో బాధపడుతున్న లక్ష్మీనారాయణ పాశ్వాన్‌కు సీఎంఆర్‌ఎఫ్ ద్వారా మంజూరైన రూ.1.50 లక్షల ఎల్వోసీని బీజేపీ సెంట్రల్ జిల్లా అధ్యక్షుడు డాక్టర్ ఎన్.గౌతమ్‌రావు శుక్రవారం పార్టీ నగర కార్యాలయంలో బాధిత కుటుంబీకులకు అందజేశారు. బీజేపీ నాయకులు ఏ.సూర్యప్రకాష్‌సింగ్, ఏడెల్లి అజయ్‌కుమార్, సాధన ఠాకూర్, అచ్చిని రమేష్ పాల్గొన్నారు. - బర్కత్‌పుర, ఆంధ్రజ్యోతి

లాస్యనందిత మృతితో అశోక్‌నగర్‌లో విషాదఛాయలు

చిక్కడపల్లి, ఫిబ్రవరి 23(ఆంధ్రజ్యోతి): కంటోన్మెంట్ ఎమ్మెల్యే లాస్యనందిత రోడ్డుప్రమాదంలో దుర్మరణం చెందడంతో అశోక్‌నగర్‌లో విషాదఛాయలు అలుముకున్నాయి. బీఆర్‌ఎస్ పార్టీ నేతలు, అభిమానులు అశోక్‌నగర్‌లోని ఆమె నివాసానికి చేరుకుని ప్రమాదానికి గల కారణాలను అడిగి తెలుసుకున్నారు. తండ్రి దివంగత ఎమ్మెల్యే సాయన్న కూతురిగానే కాకుండా కవాడిగూడ కార్పొరేటర్‌గా గెలిచి ప్రజలకు సేవలందించి వారి అభిమానాన్ని చూరగొన్నారని నేతలు గుర్తు చేసుకున్నారు.

శ్మశానవాటిక అభివృద్ధికి నిధుల మంజూరు

రాంనగర్, ఫిబ్రవరి 23 (ఆంధ్రజ్యోతి): ఈనెల 25న ముస్లింలు పవిత్రంగా జరుపుకునే జెగినేకీ రాత్ సందర్భంగా అంబర్‌పేట నియోజకవర్గంలోని ముస్లింల శ్మశాన వాటికలో అభివృద్ధి పనులకి నిధుల మంజూరు అయినట్లు టీపీసీసీ కార్యదర్శి శంభుల శ్రీకాంత్‌గౌడ్ తెలిపారు. మాజీ ఎంపీ వి.హనుమంతరావు, కాంగ్రెస్ పార్టీ అంబర్‌పేట ఇన్‌చార్జి డాక్టర్ సి.రోహిణ్‌రెడ్డి జెగినేకీరాత్ సందర్భంగా వసతుల కల్పనకు నిధులు మంజూరు చేయాలని జీహెచ్‌ఎంసీ కమిషనర్ దృష్టికి తీసుకెళ్లారు. ఇందుకు స్పందించిన అధికారులు శ్మశానవాటికలో లైట్లు ఇతరత్ర పనులను ప్రారంభించినట్లు తెలిపారు.

'మాక్స్ హౌసింగ్ సొసైటీకి స్థలాలు కేటాయించాలి'

బర్కత్‌పుర, ఫిబ్రవరి 23 (ఆంధ్రజ్యోతి): రంగారెడ్డి జిల్లా శేరిలింగంపల్లి మండలం గోపన్‌పల్లిలో ఉద్యోగులకు కేటాయించిన ఇళ్ల స్థలాల పంపిణీలో జాప్యాన్ని నివారించి టీఎన్జీవో గచ్చిబౌలి మాక్స్ హౌసింగ్ సొసైటీకి స్థలాలు కేటాయించేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని తెలంగాణ ప్రభుత్వ పెన్షనర్ల సంఘం విజ్ఞప్తి చేసింది. ఈ మేరకు సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కనకం కొమరెల్లి, ప్రధాన కార్యదర్శి తూము అశోక్‌రెడ్డిల ప్రతినిధి బృందం రాష్ట్ర మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డిని కలిసి వినతిపత్రం సమర్పించారు. ఇందుకు స్పందించిన మంత్రి సానుకూలంగా స్పందించారని వారన్నారు. మంత్రిని కలిసిన వారిలో సంఘం నేతలు జి.సూర్యకళ, ఎస్.వేణుగోపాలస్వామి, కె.యాదగిరి, కె.లక్ష్మణ్‌కుమార్, డి.పవన్‌కుమార్, ఝాన్సీరాణి, ఝాన్సీ లక్ష్మీబాయి, రామనాథచెట్టి, స్వర్ణకుమారి, జయసేనారెడ్డి, శ్రీదేవి, అబ్దుల్ సాదిక్, పి.కమలాకర్‌రావు తదితరులు ఉన్నారు.

'బీసీలకు 8 పార్లమెంట్ సీట్లు ఇవ్వాలి'



వినతిపత్రం అందుకుంటున్న ఉమాశంకర్

రాంనగర్, ఫిబ్రవరి 23 (ఆంధ్రజ్యోతి): పార్లమెంట్ ఎన్నికల్లో బీజేపీ బీసీలకు 8 ఎంపీ స్థానాలు ఇవ్వాలని కోరుతూ బీసీసేన రాష్ట్ర అధ్యక్షుడు బూరుగుపల్లి కృష్ణయాదవ్ శుక్రవారం బీజేపీ రాష్ట్ర ప్రధాన కార్యాలయం సెక్రటరీ ఉమాశంకర్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు కిషన్‌రెడ్డి సంకల్పయాత్రలో ఉన్నందున కార్యాలయ కార్యదర్శికి వినతిపత్రం సమర్పించామన్నారు. మహబూబ్‌నగర్ బీజేపీ ఎంపీ సీటు బీసీ నాయకుడు బండారి శాంతికుమార్‌కు ఇవ్వాలని కోరామన్నారు. జనాభాలో సగభాగం ఉన్న బీసీలకు 8 ఎంపీ సీట్లు ఇచ్చి తమకు బీసీల పట్ల ఉన్న చిత్తశుద్ధిని నాటుకోవాలని ఆయన కోరారు. రామస్వామి, జి.నర్సింహులు, ఎడ్ల రాజు తదితరులు పాల్గొన్నారు.

కేజ్రీవాల్‌ను అరెస్ట్ చేస్తే ప్రజాసునామి

ఆప్ తెలంగాణ రాష్ట్ర కన్వీనర్ డాక్టర్ సుధాకర్



మాట్లాడుతున్న డాక్టర్ దిడ్డి సుధాకర్ తదితరులు

కవాడిగూడ, ఫిబ్రవరి 23 (ఆంధ్రజ్యోతి): ఢిల్లీ సీఎం అరవింద్ కేజ్రీవాల్‌కు ఈడీ, సీబీఐ సమన్లు రావడం వెనుక బీజేపీ కుట్ర దాగి ఉందని, ఆయనను అరెస్టు చేస్తే దేశంలో ప్రజా సునామి తప్పదని ఆప్ తెలంగాణ రాష్ట్ర కన్వీనర్ డాక్టర్ దిడ్డి సుధాకర్ హెచ్చరించారు. శుక్రవారం దోమలగూడలోని పార్టీ రాష్ట్ర కార్యాలయంలో విలేకరులతో ఆయన మాట్లాడుతూ.. ఆప్ జాతీయ కన్వీనర్, ఢిల్లీ సీఎం అరవింద్ కేజ్రీవాల్‌ను అరెస్టు చేయాలని ఈడీ, సీబీఐలకు సూచనలు చేసి అక్రమ నోటీసులు పంపుతున్నారని ఆరోపించారు. సీబీఐ, ఈడీ వంటి దర్యాప్తు సంస్థలు ప్రతిపక్ష నాయకులపై జరుగుతున్న విచారణ, అవినీతికి వ్యతిరేకంగా పోరాటంలో భాగం కాదని, కేవలం రాజకీయ ప్రతీకారమేనని ఆరోపించారు. బీజేపీని ప్రశ్నించే వారిని జైలుకు పంపుతున్నారనిన్నారు. పార్లమెంటు ఎన్నికల్లో ఇండియా కూటమిలో భాగంగా ఆప్, కాంగ్రెస్ పార్టీల ఎన్నికల ఒప్పందం బీజేపీని చావు దెబ్బతీస్తుందని ప్రధాని మోదీ బయపడి ఆప్‌ను అణచివేయడానికి కుట్రలు చేస్తున్నాడని ఆరోపించారు. డాక్టర్ సోల్‌మన్‌రాజు, మహిళా విభాగం అధ్యక్ష, కార్యదర్శులు నర్సింగ్ యమునాగౌడ్, హేమ జిల్లోజు, డాక్టర్ లక్ష్మానాయుడుతో పాటు నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

పెట్టుబడుల పేరుతో రూ.2.48 కోట్ల మోసం



శ్రీనాథ్ రాఠి

హైదరాబాద్ సిటీ, ఫిబ్రవరి 23 (ఆంధ్రజ్యోతి): పెట్టుబడికి అధిక లాభాలంటూ నమ్మించి, పలువురి నుంచి రూ. 2.48 కోట్లు కాజేసిన మోసగాడిని హైదరాబాద్ సీసీఎస్ పోలీసులు అరెస్ట్ చేశారు. కాచిగూడ నింబోలిఅడ్డాకు చెందిన శ్రీనాథ్ రాఠి (25), పలువురు చార్టెడ్ అకౌంటెంట్లతో పరిచయం పెంచుకున్నాడు. పెట్టుబడికి అధిక లాభాలు అంటూ నమ్మించాడు. ముందుగా తీసుకున్న మొత్తానికి లాభాలు కలిపి ఇస్తుండటంతో నమ్మకం పెరిగి రూ. 2.48 కోట్లు ఇచ్చారు. డబ్బులు ఖాతాలో పడిన తర్వాత శ్రీకాంత్ స్పందించడం మానేశాడు. దాంతో మోసపోయామని గ్రహించిన బాధితులు సీసీఎస్‌లో ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసుకున్న సీసీఎస్ పోలీసులు నిందితుడిని అరెస్ట్ చేసి, రిమాండ్‌కు తరలించారు.

గురుకుల పోస్టుల భర్తీలో ఆప్షన్ పద్ధతి పాటించాలి

యూనివర్సిటీ విద్యార్థుల ర్యాలీలో ఎంపీ ఆర్.కృష్ణయ్య



బీసీ భవన్ వరకు భారీ ర్యాలీలో ఎంపీ ఆర్.కృష్ణయ్య, గుజ్జ కృష్ణ, అభ్యర్థులు

రాంనగర్, ఫిబ్రవరి 23 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో నిరుద్యోగ సమస్య తీవ్రతరంగా ఉన్న ఈ కాలంలో వేలాదిగా మిగిలిన బ్యాక్‌లాగ్ పోస్టులను భర్తీ చేయాలని రాజ్యసభసభ్యులు ఆర్.కృష్ణయ్య ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. రిలింకాష్ పద్ధతి ప్రవేశపెట్టి ఆప్షన్ పద్ధతి ద్వారా మిగతా పోస్టులను మెరిట్‌లో ఉన్న వారితో నింపాలన్నారు. రిలిం క్యాష్, ఆప్షన్ పద్ధతి పాటించి ఒకరికి ఒక పోస్టు ఇచ్చి తదుపరి మెరిట్ వారికి ఇవ్వాలని డిమాండ్ చేస్తూ నిరుద్యోగ అభ్యర్థులు శుక్రవారం యూనివర్సిటీ విద్యార్థుల ఆధ్వర్యంలో విద్యానగర్‌లోని బీసీభవన్ వరకు భారీర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆర్.కృష్ణయ్య మాట్లాడుతూ.. గురుకుల అభ్యర్థులు అన్ని పోస్టులకు పరీక్షలు రాశారని, చాలా ఎక్కువ మంది ఒకటి కంటే ఎక్కువ పోస్టులకు ఎంపిక అవుతారన్నారు. ఒక అభ్యర్థికి డీఎల్‌కి ఎంపికైన వ్యక్తియే జేఎల్, పీజీటీ, టీజీటీ, పీడీలలో కూడా ఎంపిక అవుతున్నాడని, కానీ ఆ వ్యక్తి అన్ని ఉద్యోగాలు చేయలేడని, పై స్థాయి పోస్టులను ఎంపిక చేసుకుంటాడన్నారు. దీని వల్ల మిగతా ఉద్యోగాలలో బ్యాక్‌లాగ్ ఏర్పడతాయన్నారు. మొదట పై స్థాయి నుంచి క్రింది స్థాయి పోస్టులను భర్తీ చేయాలని కోరారు. ర్యాలీలో బీసీ సంక్షేమ సంఘం జాతీయ కన్వీనర్ గుజ్జ కృష్ణ, నాయకులు నీల వెంకటేష్, సుధాకర్, నందగోపాల్, సి.రాజేందర్, అనంతయ్య, రామలింగం, మధుసూదన్, హస్మబేగం, ఉపేంద్ర, బాలరాజు, రాజేందర్, సుజాత, లావణ్య, ఆలేఖ్య లక్ష్మి, దీపిక తదితరులు పాల్గొన్నారు.